క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయవాడరూరల్: జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఏడు నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా ఈనెల 10న శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈ ఓలేటి దుర్గారావు తెలిపారు. దీనివల్ల ఉషాబాలానగర్, యానాదుల కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు, గొడుగువారిగూడెం, నందనం తోట, గాంధీనగర్, స్టేషన్‌తోట, శ్రీనివాసా సెంటర్, కుమ్మరిపేట, ఢంఢంతోట, ముస్లింపేట, భువనగిరిపేట, అజరయ్యపేట, మైలవరం రోడ్డు, ఐదుబజార్ల సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

యూట్యూబ్ చానల్స్‌కు అనుమతిలేదు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ, మండల ప్రజాపరిషత్ కార్యక్రమాల మీడియా కవరేజ్‌కు యూట్యూబ్ చానల్స్ ప్రతినిధులకు అనుమతి లేదని ఎంపీపీ పాలడుగు జోత్స్న ప్రకటించారు. ఈ మేరకు ఎంపీపీ కార్యాలయం వద్ద శుక్రవారం నోటీస్ బోర్డు ఏర్పాటు చేశారు. పాత్రికేయుల విలువలు కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఏదో ఒకపేరుతో యూట్యూబర్లుగా చలామణి అవుతూ అధికారుల విధులకు ఆటంకం కలిగిస్తున్నట్లు తెలిపారు. కొందరు యూట్యూబర్ల వలన నిజమైన జర్నలిస్ట్‌లకు చెడ్డపేరు వస్తుందని పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు



మైలవరం: మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా జె.వెంకటేశ్వరరావును ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎస్వీఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడుగా వెంకటేశ్వరరావు, సెక్రటరీగా చలవాది గుప్తా హరీష్ కుమార్, ట్రెజరర్‌గా తిమ్మిన దీనేష్‌బాబును ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూర్వపు లయన్ గవర్నర్ ఎస్‌వీఎస్ నివృతరావు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన వారు లయన్స్ క్లబ్‌కు మంచి పేరు తీసుకురావాలన్నారు. జోన్ చైర్మన్ జగదీష్, క్యాబినెట్ మెంబర్లు సీహెచ్. బాలగోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, కిషోర్, ఏడుకొండలు, సాంబిరెడ్డి, కోట పుల్లారెడ్డి పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ బోర్ల నిర్మాణం

ఆంజనేయపురం(తిరువూరురూరల్): మండలంలోని ఆంజనేయపురంలో జలజీవన్‌మిషన్ పథకం కింద బోర్ల నిర్మాణాన్ని సర్పంచ్ మామిడి కుటుంబరావు శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య నివారణకు ఇంటింటికీ కుళాయిల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, పంచాయతీ ఉప సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

తప్పిన అగ్ని ప్రమాదం



జి.కొండూరు: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యుత్‌లైన్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పు రవ్వలు పడి ఎండుగడ్డి తగలబడింది. అదే సమయంలో గాలి ఎక్కువగా వీస్తుండడంతో మంటలు ఎగసిపడ్డాయి. అధికారులు వెంటనే అప్రమత్తమై ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. జి.కొండూరు గెయిల్ ఇండియా కంపెనీకి చెందిన ఫైర్ ఇంజిన్‌తో పాటు మైలవరం ఫైర్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదంలో ఎటువంటి ఆస్తి నష్టం వాటిల్లలేదని విద్యుత్‌శాఖ ఏఈ రామ్మోహన్‌రావు తెలిపారు.

ట్యాంక్‌లను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్



రెడ్డిగూడెం: మండలంలోని రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాలలో ఏర్పాటు చేసిన అమృత సరోవర్ ట్యాంక్‌లను డిప్యూటీ కమిషనర్ జి.జ్యోతి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సునీత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెండు చెరువుల కట్టలపై మామిడి మొక్కలను వారు నాటారు. ఏపీడీ ఎస్.మున్ని, ఏపీఓ ఏ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఊటుకూరు(గంపలగూడెం): సంక్షేమ పథకాల అమలులో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు-1 సచివాలయం పరిధిలో శుకవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ బజారు, బొడ్డురాయి సెంటర్, దుందిరాలపాడు రహదార్లలో ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందిన ప్రయోజనాన్ని వివరించడంతోపాటు తగిన సమాచారంతో ముద్రించిన బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నిక సమయంలో ఓటు ఎవరికి వేశారని చూడకుండా, కుల, మత, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రజలు ఇంకా ఏమైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? అని తెల్సుకునేందుకు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ముందుగా ఎమ్మెల్యేకు డప్పులతో పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఊటుకూరు సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, ఉపసర్పంచ్ సంగీతం రాఘవయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జీ చెన్నకేశవరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఏఓ సాయిశ్రీ పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం

నూజివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం బడుల పునఃప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అణుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూజివీడు మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలను పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లోని స్టాకుపాయింట్ నుంచి తరలిస్తున్నారు. స్కూల్ కాంప్లెంక్స్‌ల వారీగా వీటిని ట్రక్కులలో తరలిస్తున్నారు. ఈ నెల 12నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో పాఠ్యపుస్తకాలు తరలించే పనులు శరవేగంగా సాగుతున్నాయి. సీఆర్పీలు గత వారం రోజులుగా పాఠశాలల వారీగా పాఠ్యపుస్తకాలను విభజించి వాటిని పంపిస్తున్నారు. మండలానికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు 74వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతగా 47వేల పాఠ్యపుస్తకాలు ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన స్టాకు పాయింట్‌కు చేరాయి. ఇంకా 27వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది. అవి కూడా త్వరలోనే రానున్నాయి. అవి రాగానే వాటిని ఆయా పాఠశాలలకు తరలించేందుకు విద్యాశాఖ సిబ్బంది సిద్ధంగా ఉన్నారు.

శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి

విస్సన్నపేట: స్థానిక బస్టాండ్ వెనుక ఉన్న శ్మశాన వాటికను అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా దహన, ఖననం చేసుకునే విధంగా అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు, పట్టణ నాయకుడు మేకల జ్ఞానరత్నం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు, ఎంపీడీఓ ఎస్.వెంకటరమణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శ్మశాన స్థలంలో ఆక్రమణకు గురైన స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యార్థుల పుస్తక పఠనం

నూజివీడు: పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు ఈమని శేషయ్య దేశభక్తి గీతాలను నేర్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి కథలను వారితో చెప్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది యశ్వంత్, నాగలక్ష్మి పాల్గొన్నారు.

నీతి కథలపై అవగాహన

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సామెతలు, నీతి కథలపై అవగామన కల్పించారు. అనంతరం ఉపాధ్యాయుడు బాణావతి మురళి విద్యార్థులకు బాల బొమ్మల నీతి కథలు, తెలుగు పదాలతో పాటు సైన్స్ గురించి వివరించారు. గ్రంథాలయ సిబ్బంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కథల పఠనం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులతో అద్భుత కథలను చదివించారు. విశ్రాంత ఎంఈఓ వి.శేషిరెడ్డి సౌజన్యంతో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు స్కేల్, పెన్సిల్, స్కెచ్ పెన్నుల ప్యాకెట్, క్రెయిన్స్, ప్యాకెట్ బహుమతిగా అందజేశారు. ముందుగా క్విజ్ పోటీ నిర్వహించారు. షిరిడీ సాయి సేవ సమితి సభ్యులు నారాయణరావు, ఉపాధ్యాయులు నాగరాజు, గ్రంథాలయ నిర్వహణ అధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

ఇతిహాసాలు చదవాలి

తిరువూరు: బాల్యంలోనే విద్యార్థులకు తల్లిదండ్రులు రామాయణ, మహాభారత ఇతిహాసాలు చదివే అలవాటు చేయాలని సత్యసాయి సేవా సమితి బాలవికాస్ ఇన్‌చార్జి సీతారత్నకుమారి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరంలో రామాయణ, భారత పద్యాలలో విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. నైతిక విలువలను పెంచే ఇతిహాసాలు ప్రతిఒక్కరూ చదవాలని సూచించారు. విద్యార్థులకు నృత్యపోటీలు, పాటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి పద్మావతి పాల్గొన్నారు.

ఈ-స్టాంపింగ్‌ను సద్వినియోగం చేసుకోండి



తోటమూల ఈ-స్టాంప్‌ల సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తోటమూల(గంపలగూడెం): ఈ-స్టాంపింగ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం తోటమూలకు చెందిన గోగిరెడ్డి ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఈ-స్టాంపింగ్ సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అన్ని రకాల స్టాంప్‌లు, బ్యాంకులు, రిజిస్ట్రేషన్లు, అగ్రిమెంట్లకు సంబంధించిన ఈ-స్టాంప్‌లను ఇక్కడ అందుబాటులో ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తగుండ్ల నరశింహారావు, చెరుకు నర్సారెడ్డి, న్యాయవాది గోగిరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



చనుబండలో అమృత సరోవర్ పనులు పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్

చాట్రాయి: మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పోలవరం, చాట్రాయి, నరశింహారావుపాలెం, చనుబండ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడులు తెరిచే లోగా నాడు-నేడు పనులను పూర్తి చేయాలన్నారు. పోలవరంలో కమ్యూనిటీ హాల్ భవనం ఎలక్ట్రికల్ పనులు చేయించకపోవడంపై పంచాయతీరాజ్ ఏఈ ఇంజనీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసారు. చాట్రాయి మెయిన్ స్కూలు అభివృద్ధి పనులు, చనుబండ గ్రామంలో చేపట్టిన అమృత సరోవర్ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహసీల్దార్ విశ్వనాథరావు ఎంపీడీఓ దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: విత్తనాల పంపిణీలో ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వేముల కొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ, రైతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను వివరించారు. ఏఓ రాంకుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్రంలో వారం రోజుల్లో వరి విత్తనాలను పంపిణీకి సిద్ధంగా ఉంచుతామని చెప్పారు.

పెనుగంచిప్రోలుకు బస్సుసర్వీసు

తిరువూరు: తిరువూరు నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెనుగంచిప్రోలుకు ప్రతి ఆదివారం బస్సు సర్వీసు నిర్వహించనున్నట్లు తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజరు వేణు తెలిపారు. ఉదయం 6.30 గంటలకు తిరువూరులో ఈ బస్సు బయల్దేరి గంపలగూడెం, మధిర, పెనుగంచిప్రోలు మీదుగా జగ్గయ్యపేట చేరుతుందని, తిరిగి 9.45 గంటలకు బయలుదేరి 12.45 గంటలకు తిరువూరు చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తిరువూరు నుంచి జగ్గయ్యపేటకు వెళ్లి మళ్లీ 4.45 గంటలకు తిరువూరు బయల్దేరుతుందని తెలిపారు. పెనుగంచిప్రోలు వెళ్లే ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12న మర్రిబంధంలో గ్రామసభ

నూజివీడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని మర్రిబంధంలోని వ్యవసాయేతర, గ్రామకంఠం భూములకు సంబంధించిన యాజమాన్య హక్కుల తుది జాబితాను రూపొందించేందుకు ఈనెల 12న గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే వ్యవసాయేతర, గ్రామకంఠం భూములకు సంబంధించిన ముసాయిదా రికార్డును సిద్ధం చేశామన్నారు. ఈ రికార్డును ఈ నెల మూడో తేదీ నుంచి ప్రజల పరిశీలనార్థం, అభ్యంతరాల స్వీకరణకు పంచాయతీ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. భూయజమానులు గ్రామసభకు హాజరుకావాలని తహసీల్దార్ విజ్ఞప్తి చేశారు.

ఈదురు గాలులకు కోళ్ల ఫారం ధ్వంసం

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెంలో శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులకు గ్రామానికి చెందిన అబ్దుల్ జావేద్‌కి చెందిన కోళ్ల ఫారం షెడ్డు కూలిపోయింది. సుమారు ఐదు వేలు కోళ్లు చనిపోయాయి.సుమారు రూ. 15 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

హైవేలో కూలిన చెట్లు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): మండలంలోని గుంటుపల్లిలో శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు 65వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న 13 చెట్లు కూలాయి. కూలిన చెట్లు హైవేపై పడటంతో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సీఐ పి.శ్రీను పంచాయతీ సిబ్బంది, పొక్లేన్ సహకారంతో కూలిన చెట్లు తొలగించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. ఎస్ఐ పాపారావు, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నిర్మూలన

నూజివీడు: పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన సాధ్యమవుతుందని, అప్పుడే మలేరియాను నివారించవచ్చని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కొలుసు సౌమ్య అన్నారు. పట్టణంలోని కోనేరుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం సిబ్బందితో కలిసి మలేరియా నిర్మూలన అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దోమలు వ్యాప్తి చెందకుండా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ను పాటించాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి యలమంద, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో భావోద్వేగ నియంత్రణ కీలకం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి



విద్యార్థినులను సత్కరించిన ప్రిన్సిపాల్

మైలవరం: విద్యార్థి దశలో భావోద్వేగ నియంత్రణ కీలకమని స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇల్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో భావోద్వేగ నియంత్రణకు సంబంధించి ప్రత్యేక సదస్సు శుక్రవారం జరిగింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో టీనేజ్ దశ కీలకమైనదన్నారు. శరీర మార్పులు సహజంగా సంభవిస్తాయని, వీటి గురించి ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. డిగ్రీ కళాశాలకు వచ్చిన విద్యార్థులు భావోద్వేగాలను నియంత్రించుకోవాలన్నారు. ఐక్యా పెంపుదలకు కృషి చేయాలన్నారు. ఆలోచనల నుంచి ఆచరణ ప్రారంభమవుతుంది కనుక ఆలోచన వచ్చినపుడే మంచిది, చెడ్డదీ నిర్ణయించుకోవాలన్నారు. మన కర్తవ్యం గురించి ఎల్లప్పుడు ఆలోచించాలన్నారు. గొప్ప ఆలోచనలు చేయండి, గొప్ప చదువులు చదవాలి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలని నిరంతరం తలపోయాలన్నారు. అనవసరమైన విషయాలైన ప్రేమ, గొడవలు, వ్యసనాలు జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను చేతులారా నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమాన్ని ఇంగ్లిష్ అధ్యాపకురాలు బి.సుభాషిణి పర్యవేక్షించారు. అనంతరం డిగ్రీ థర్డ్ సెమిస్టర్‌లో నూటికి నూరు మార్కులు సాధించిన బీఏ ద్వితీయ విద్యార్థినులు ఎస్. విజయభార్గవి, షేక్ అబిద, ఫిజిక్స్‌లో 99మార్కులు సాధించిన బాలసుస్మితను ప్రిన్సిపాల్ సత్కరించారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



తిరువూరు మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల ప్రచారం

తిరువూరు: అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన బోధన అందించేందుకు తమ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రెబ్బు మురళీకృష్ణ కోరారు. మండలంలోని వావిలాల, రాజుగూడెం గ్రామాల్లో విద్యార్థులను శుక్రవారం కలిసి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. అమ్మ ఒడి కింద చదువునకు ఆర్థికసాయం, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని మురళీకృష్ణ సూచించారు.

రోడ్డుప్రమాదాల నివారణకు చర్యలు

తిరువూరు: తిరువూరు సర్కిల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు సీఐ భీమరాజు తెలిపారు. మధిరరోడ్డులోని చింతలపాడు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాన్ని శుక్రవారం పరిశీలించిన సీఐ తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై సిబ్బందికి సూచనలిచ్చారు. సర్కిల్లో గత మూడు నెలల్లో అధిక సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాహనచోదకులు మద్యం సేవించి వాహనం నడిపినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి ప్రమాదాల నివారణకు అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే వసంతను కలిసిన తహసీల్దార్



ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీనివాసరావు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఐతవరంలోని ఆయన గృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మండల ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పురోగతి కనిపించాలని ఎమ్మెల్యే సూచించారు.

తహసీల్దార్‌ను కలిసిన నాయకులు

తహసీల్దార్ శ్రీనివాసరావును కొండపల్లి మున్సిపాల్టీ వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. జిల్లా వైఎస్సార్ సీపీ ఐటీవింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోస్, లంకే అంకమోహనరావు, కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మీ, ప్రకాష్, దయాకర్, బత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సారా కేసుల్లో ఉన్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి



సారాయి కేసుల్లో ఉన్నవారికి కుట్టు మిషన్లు అందజేస్తున్న రామకృష్ణప్రసాద్, శ్రీనివాసరావు

మైలవరం/రెడ్డిగూడెం: సారాయి కేసులలోని ఉన్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించనున్నట్లు విజయవాడ ఎస్ఈబీ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ కేవీ రామకృష్ణప్రసాద్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు విజయవాడ ఎస్ఈబీ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో మైలవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. సారాయి కేసులలో ఉన్నవారితో రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో గౌరవంగా బతకడం కోసం అర్హత కలిగిన వారికి డీఆర్‌డీఏ సమన్వయంతో వివిధ రకాల వ్యాపారాలకు సబ్సిడీపై డీఆర్‌డీఏ, ఎన్టీఆర్ జిల్లా వారి ద్వారా లోన్లు ఇప్పించి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తగిన అవకాశం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా మైలవరం, తిరువూరు ఎస్ఈబీ స్టేషన్ల పరిధిలో ఇప్పటి వరకు 57 కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధికి అవసరమైన కుట్టుమిషన్లు, కర్రీ పాయింట్, టిఫిన్ సెంటర్ సామగ్రి, కోళ్లు, గొర్రెల పెంపకం, ఎంబ్రాయిడరీ, మగ్గాలు అందజేశారు. ముందుగా మదర్ థెరీసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నెల రోజులు కుట్టు, ఎంబ్రాయిడరీ లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రుద్రవరం తండాకు చెందిన ధరావతు బద్దుకు ట్రాక్టర్ కోసం రూ.10లక్షలు, ధారావత్ కవితకు పిండిమిల్లు కోసం రూ.2లక్షలు, అన్నేరావుపేట తండాకు చెందిన భారోతు వంశీకృష్ణకు ల్యాబ్ కోసం రూ.4 లక్షలు బ్యాంకుల వారితో సంప్రదించి 35శాతం సబ్సిడీపై రుణాలు మంజూరు చేయించామన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు, రెడ్డిగూడెం, వెలుగు సిబ్బంది, ఎస్ఈబీ సీఐ పీ గిరిజ సత్యకుమారి, ఎస్సై అనిల్‌బాబు పాల్గొన్నారు.